క్లుప్తంగా

చదువుతోనే గుర్తింపు

నేరడిగొండ: చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని సామాజిక కార్యకర్త నిమ్మల సంతోష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వడూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సమత, రాంకిషన్, ప్రధానోపాధ్యాయులు డి.భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'దాడులను ఖండించాలి'

ఉట్నూర్‌రూరల్: నాయయవాదులపై దాడులను ఖండించాలని ఉట్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పెందూర్ ప్రభాకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లాలో న్యాయవాదిపై పోలీసులు దాడికి నిరసనగా శుక్రవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదులు బాపురెడ్డి, జమీర్‌ఖాన్, బానోత్ జగన్, జైవంత్‌రావు, వసంత్‌రావు, చంద్రమౌళి, అశోక్, రాజు, సంగీత పాల్గొన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న మోదీ'

బోథ్: ప్రధాని నరేంద్రమోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాడని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీపై లోక్‌సభలో అనర్హత వేటు వేయడం సరికాదన్నారు.

'వేధిస్తే చర్యలు తప్పవు'

ఆదిలాబాద్‌టౌన్: యువతులు, మహిళలు, విద్యార్థులను వేధిస్తే చర్యలు తప్పవని సఖీ కేంద్రం కౌన్సిలర్లు లావణ్య, సంఘమిత్రలు అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని తెలంగాణ స్పోర్ట్ స్కూల్, బ్యూటీషియన్ శిక్షణ కేంద్రంలో అవగాహన కల్పించారు. మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తే 100, 181, 1098, 14567 నంబర్లకు డయల్ చేయాలన్నారు.

బంతిసాగుపై శిక్షణ

తలమడుగు: మండలంలోని సకినపూర్ గ్రామంలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి బంతిపూల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెలకువల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మారుతి, రైతులు పాల్గొన్నారు.

భక్తుల పాదయాత్ర

నేరడిగొండ: శబరిమాత భక్తులు తాడ్వాయికి పాదయాత్ర చేపట్టారు. శుక్రవారం నేరడిగొండ మండలానికి చేరుకుంది. వాంకిడి గ్రామంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని సర్పంచ్ రాజు ఏర్పాటు చేశారు. ధార్మిక్‌నగర్ వద్ద తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ పండ్లు, మజ్జిగ అందజేశారు. ఈ పాదయాత్ర శ్రీరామ నవమిని పురస్కరించుకొని ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతుందని భక్తులు తెలిపారు.

మాజీ ఎంప్లాయ్‌మెంట్ అధికారిపై ఫిర్యాదు

కైలాస్‌నగర్: ఏసీబీ కేసులో అరెస్టై, జైలు శిక్ష అనుభవిస్తున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి కిరణ్ కుమార్‌పై శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వేధింపులకు బలైన శంకర్ నాయక్‌తండా గ్రామానికి చెందిన చవాన్ శ్రీనివాస్ కుటుంబసభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని మృతుడి తండ్రి చౌహాన్ వసంత్‌రావు కోరారు. కార్యక్రమంలో దుర్గం శేఖర్, సర్పంచ్ ధర్మానాయక్, మదస్తు మహేందర్, కావేటి మోహన్ యాదవ్, ఆడే రఘునాథ్ పాల్గొన్నారు.

కలశ స్థాపనకు తరలిరండి

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఈనెల 25, 26న నిర్వహించే కలశ స్థాపన కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని ఆదివాసీ నాయకులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో నాయకులు పుర్క బాపురావ్, సోయం రాందాస్, పెందోర్ పుష్పరాణి, చహకటి సూర్యరావ్ పాల్గొన్నారు.

అఖండ హరినామ యజ్ఞం

తాంసి: మండలంలోని వామన్‌నగర్‌లో శుక్రవారం నారాయణబాబా 20వ అఖండ హరినామ యజ్ఞం నిర్వహించారు. నారాయణబాబా ఆలయం వద్ద జెండా ఎగరవేసి పూజలు చేశారు. అనంతరం యజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వన్నెల ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యాధికారి అశోక్, సునీత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గుగ్గిల పోచ్చన్న, జాదవ్ కిషన్, భూమన్న, అశోక్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఇంద్రవెల్లి: గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీవో వేణుకు వినతిపత్రం అందజేశారు. నాలుగు నెలల నుంచి వేతనాలు చెల్లించకుండా చెక్కులను రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీజింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. వేతనాలు చెల్లించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ అస్తక్ సుభాష్, దిపక్‌సింగ్ షేకవత్, జైస్వాల్ శివకుమార్, మడావి భీంరావ్, ఆరెల్లి రాజలింగు, భరత్, రాజు పాల్గొన్నారు.

వైభవంగా శతచండీయాగం

ఆదిలాబాద్‌రూరల్: లోక కల్యాణార్థం దుర్గామాతా ఆలయ పూజారి కిషన్ మహరాజ్ ఆధ్వర్యంలో రుద్రరహిత శతచండీ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం దుర్గనగర్‌లోని దుర్గామాతా ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య యాగం, యజ్ఞం క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదిలాబాద్ నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు తరలివచ్చారు.



వివిధ రూపాల్లో ఉన్న దుర్గమాతా ప్రతిమలు



యాగంలో పాల్గొన్న జంటలు



పాల్గొన్న ఎమ్మెల్యే జోగు రామన్న దంపతులు

తోడేస్తున్నారు..



పెన్‌గంగ నదిలో తాంసి(కె) వద్ద ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు

- అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు
- పెన్‌గంగ నుంచి యథేచ్ఛగా తరలింపు
- పట్టించుకోని అధికారులు

తాంసి: మహారాష్ట్ర–తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో పెన్‌గంగ నది ప్రవహిస్తోంది. జిల్లాలోని భీంపూర్ మండలంలోని పలు గ్రామాల గుండా ప్రవహిస్తున్న పెన్‌గంగ నదిలో అక్రమార్కులు ఇసుకను తోడేస్తున్నారు. అనుమతి లేకుండా ఇసుక తవ్వి ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తాంసి(కె), గుబిడి, అంతర్గాం, వడూర్ గ్రామాల శివారు ప్రాంతాల్లో నది నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అయినా రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు.

వేగంగా వెళ్తున్న ట్రాక్టర్లు

జిల్లా కేంద్రంతోపాటు గ్రామాల గుండా వెళ్తున్న ఇసుక ట్రాక్టర్లు అతి వేగంతో పరుగులు పెడుతున్నాయి. డ్రైవర్లు మద్యం తాగి, ఇష్టారీతిగా నడపడంతో పలుచోట్ల ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. పిప్పల్‌కోటి, గొల్లఘాట్, నిపాని, లక్ష్మీపూర్ గ్రామాల సమీపంలో ట్రాక్టర్లు బోల్తాపడ్డాయి. గత రెండు రోజుల క్రితం ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో డ్రైవర్ మృతి చెందాడు. తాంసి(కె), అంతర్గాం, భీంపూర్ గ్రామాల రోడ్లపై వెళ్లాలంటే వాహనదారులు, ప్రజలు భయపడుతున్నారు.

ఇసుక వ్యాపారం ఎంచుకుంటూ..

పెన్‌గంగ నది వెంట ఉన్న తాంసి(కె), గుబిడి, వడూర్, అంతర్గాం గ్రామాల ప్రజలు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో ఇసుక వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారు. ట్రాక్టర్ల కొనుగోలు చేసి ఇసుక తవ్వుతున్నారు. తాంసి(కె)లో ఏకంగా ఆ గ్రామస్తులవి 40కి పైగా ట్రాక్టర్లు ఉన్నాయి. గత సంవత్సరం అంతర్గాం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పెన్‌గంగ నదిలో ఇసుక తీయడానికి వీడీసీ వేలంలో టెండర్ దక్కించుకున్నాడు. ఇసుక తరలించడానికి జేసీబీతోపాటు మూడు ట్రాక్టర్లను కొనుగోలు చేశాడు.

పట్టించుకోని అధికారులు

ఇసుక నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తునప్పటికి ఒక్కటి రెండు ట్రాక్టర్‌లకు సంబంధిత అధికారులు నామమాత్రపు జరిమానా విధిస్తూ చూసీ చూడనట్లుగా వాహనాలను వదిలేస్తున్నారు. అధికారులపై స్థానిక ప్రజాప్రతినిధులు ఒత్తిడే కారణమని ఆరోపణలు ఉన్నాయి. అక్రమ రవాణాలో స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, మండల నాయకుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అనుమతి తప్పనిసరి

పెన్‌గంగ నది నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. మైనింగ్, పోలీస్ శాఖ అధికారులతో కలిసి తనిఖీలు చేస్తాం. ఇసుక అక్రమంగా తవ్వుతున్నట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటాం. ఇసుకను తరలిస్తున్న వాహనాలకు పలుమార్లు జరిమానా విధించడంతోపాటు సీజ్ చేశాం.

– మహేంద్రనాథ్, తహసీల్దార్, భీంపూర్

క్షయ నివారణపై అవగాహన ర్యాలీ

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో శుక్రవారం క్షయ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. వైద్యాధికారి నిఖిల్‌రాజ్ మాట్లాడుతూ.. క్షయ నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణాధికారి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, స్టాఫ్ నర్స్ ప్రవీణ, సిబ్బంది విష్ణుకుమార్, సుజాత, అశోక్ రెడ్డి, రాందాస్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మావల మండలంలోని వాఘాపూర్ పరిధిలోని కోలాం గిరిజనులకు క్షయపై స్వచ్ఛంద సేవా సహాయకుడు భూపెల్లి శ్రీధర్ అవగాహన కల్పించారు. ప్రభుత్వం లెక్కల ప్రకారం కొలాంగూడలో ప్రతీ సంవత్సరం ఐదుగురికి సోకుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే రిమ్స్ ఆసుపత్రిలో పరీక్ష చేసి, ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే రూ. 3వేలు వారి ఖాతాలో పౌష్టికాహారం కోసం జమ చేయడం జరుగుతుందన్నారు.




తాంసి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బజార్‌హత్నూర్: జాతీయ క్షయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ శిల్పా ఆధ్వర్యంలో క్షయ నిర్మూలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుధాం, రవి, అశోక్, ఉమారాణి, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

నేరడిగొండ: ఐకేపీ వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ మండల వీవోఏలు ఐకేపీ ఏపీఎం ఉత్తమ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలన్నారు.

గుడిహత్నూర్: 20 ఏళ్లుగా సెర్ప్ ఉద్యోగులతో కలిసి పని చేస్తున్నా.. తమ సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని మండల వీవోఏలు ఆవేదన వ్యక్తం చేశారు. సెర్ప్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వారికి పే స్కేల్ ప్రకారం.. వేతనాలు చెల్లించాలన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయానికి చేరుకొని ఏపీఎం భగవాండ్లుకు వినతిపత్రం అందజేసి, సమ్మెకు వెళ్తున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో మండల సంఘం అధ్యక్షుడు ఎస్. మనోహర్, కార్యదర్శి రంగు చంద్రకళ, కోశాధికారి రవి, సభ్యులు రాజేశ్, వెంకటేశ్, ధనలక్ష్మి, దీపక్, నరేశ్, నాందేవ్, భిక్కు పాల్గొన్నారు.



గుడిహత్నూర్: వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు

ఇంద్రవెల్లికి చేరుకున్న పాదయాత్ర

ఇంద్రవెల్లి: నార్నూర్ మండలంలోని కొత్తపల్లి సేవాలాల్ దీక్షభూమి నుంచి ప్రారంభమైన సేవాలాల్ భక్తుల పోరాదేవి పాదయాత్ర గురువారం రాత్రి ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చేరుకుంది. సేవాలాల్ భక్తులు, సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం ఇంద్రవెల్లి నుంచి పాదయాత్రన బయలుదేరి వెళ్లారు. ఈనెల 28న పోరాదేవి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజల మధ్య సేవాలాల్ దీక్షను విరమించనున్నట్లు సేవాలాల్ భక్తులు తెలిపారు.

గుడిహత్నూర్: సంత్ సద్గురు సేవాలాల్ మహరాజ్ దీక్షపరులు నార్నూర్ మండలం కొత్తపల్లి నుంచి మహారాష్ట్రలోని ఆరాధ్య దైవం పోరాదేవీ ఆలయం వరకు చేపట్టిన పాదయాత్ర శుక్రవారం మండలానికి చేరుకుంది. మండలంలోని తోషంతండాలో గ్రామస్తులు విడిది ఏర్పాటు చేసి అన్నదానం చేశారు. ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్ ఘన స్వాగతం పలికారు. పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు భుక్యా జానకీబాయి, సేవాలాల్ దీక్షపరులు పాల్గొన్నారు.

నిర్మాణాలకు అనుమతి తప్పనిసరి

సాక్షి ఎఫెక్ట్..

నేరడిగొండ: మండల కేంద్రంలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో అనుమతి లేకుండానే నిర్మాణాలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో పంచాయతీ అధికారులు స్పందించారు. ఈమేరకు నిర్మాణం వద్ద నోటీసు అతికించారు. అనుమతులు తీసుకోనివారు నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు.



నోటీసు అతికిస్తున్న పంచాయతీ సిబ్బంది

కేజీబీవీలో వ్యాసరచన పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రం 1 ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ కేజీబీవీలో విద్యార్థులకు చిరుధాన్యాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఫర్హా, కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, కేజీబీవీ ప్రత్యేకాధికారి కవిత, అంగన్‌వాడీ టీచర్ రాధ, సంగీత, అర్చన, లక్ష్మి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అంకోలి ఉన్నత పాఠశాల బాలికలకు చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్ వైజర్ నీరజ మాట్లాడుతూ.. పోషణ్ పక్వాడ ఏప్రిల్ 3 వరకు కొనసాగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య, ఉపాధ్యాయులు నరేందర్ రెడ్డి, విద్యాసాగర్, అంగన్‌వాడీటీచర్లు వందన, సునీత, మహిత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గుడిహత్నూర్: చట్టాలపై అవగాహన అవసరమని బోథ్ జూనియర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.హుస్సేన్ అన్నారు. మండలంలోని పూనగూడ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా చదువుకునే హక్కు, పోక్సో చట్టం, జీవించే హక్కు, భావ వ్యక్తీకరణ హక్కుపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం బాలికల వసతి గృహాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పంద్రం శంకర్, న్యాయవాదులు ఆడెపు హరీష్, కుమ్మరి విజయ్‌కుమార్, ఎస్సై ప్రవీణ్ కుమార్, ఏఎస్సై రహమాన్‌ఖాన్, స్పెషల్ ఆఫీసర్ లావణ్య, పీసీ విజయ్, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న జడ్జి బి.హుస్సేన్

గ్రామ పంచాయతీలకు అవార్డులు

తలమడుగు: మండలంలోని ఉత్తమ గ్రామ పంచాయతీలకు శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్ అవార్డులను ప్రదానం చేశారు. కజ్జర్ల సర్పంచ్ మొట్టె వెంకటమ్మ, రుయ్యాడి సర్పంచ్ పోతరెడ్డి, ఉండమ్ సర్పంచ్ కంది పోచ్చుబాయిలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

నార్నూర్: మండలంలోని గ్రామ పంచాయతీలు అవార్డుకు ఎంపికైనట్లు ఎంపీవో స్వప్నశీల తెలిపారు. శుక్రవారం గంగాపూర్, మల్లెంగి, గుంజాల, మహాగావ్ సర్పంచ్‌లకు కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

బజార్‌హత్నూర్: మండలంలోని గులాబ్‌తాండ, దేగామ సర్పంచులు విద్యాసాగరా, లక్ష్మన్‌లకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పార్థసారథి, శంకర్ పాల్గొన్నారు.

బోథ్: దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ 2021– 22లో భాగంగా మండలంలోని కౌఠ (బి) గ్రామ పంచాయతీ పేదరికం, మెరుగైన జీవనోపాధి విభాగంలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. కాగా శుక్రవారం సర్పంచ్ కొంకటి రాధిక జిల్లా కేంద్రంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రాజు యాదవ్

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామ పంచాయతీకి జిల్లాస్థాయిలో చైల్డ్ ఫ్రెండ్లీ అవార్డు దక్కింది. శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా సర్పంచ్ రాజుయాదవ్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో శోభన, పంచాయతీ కార్యదర్శి దయాకర్ పాల్గొన్నారు.

బహుళ అంతస్తుల్లో.. లగ్జరీ అపార్ట్‌మెంట్

పాతమంచిర్యాల: పట్టణంలోని శ్రీనివాసగార్డెన్ వద్ద రక్ష హోమ్స్ పేరుతో అన్ని సౌకర్యాలతో బహుళ అంతస్తుల్లో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీ లగ్జరీ అపార్ట్‌మెంట్స్‌లో మూడు పడకల గదులు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా రక్ష హోమ్స్ ఎండీ కైలాస్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో మొదటిసారి గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్‌ను పచ్చదనం ఉట్టిపడేలా నిర్మించామన్నారు. ఆధునిక హంగులతో చిన్న పిల్లలకు ఆటస్థలం, పార్కు, స్విమ్మింగ్‌పూల్, క్లబ్ హౌజ్‌తోపాటు పురుషులు, మహిళలకు ప్రత్యేక జిమ్, కాన్ఫరెన్స్ హాలు నిర్మించినట్లు తెలిపారు. 24 గంటల జనరేటర్ సౌకర్యం, అపార్ట్‌మెంట్ చుట్టూ సోలార్ ఫెన్సింగ్, కంపోడ్ వాల్, సీసీ కెమెరాలు అమర్చామని అన్నారు. మైగేట్ యాప్, విశాలమైన పార్కింగ్, ప్రకృతి రమణీయంగా నిర్మించామన్నారు. ఈస్ట్, వెస్ట్ ఫేసింగ్ 1600 చదరపు అడుగుల ప్లాట్లు కస్టమర్లకు సరసమైన ధరల్లో లభిస్తాయన్నారు. క్లియర్ టైటిల్ స్థలంలో నిర్మించిన ప్లాట్ల కొనుగోలుకు అన్ని ప్రముఖ బ్యాంకుల నుంచి లోన్లు లభిస్తాయన్నారు.



రక్ష హోమ్స్ అపార్ట్‌మెంట్స్

సమాచారం

నేడు రిమ్స్‌లో మెడికోలకు అవగాహన

ఆదిలాబాద్‌అర్బన్: మెడికో న్యాయ అవగాహన కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు రిమ్స్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే తెలిపారు. మెడికోలు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

రేపు వైద్యశిబిరం

ఆదిలాబాద్‌అర్బన్: ఆదిలాబాద్‌లోని జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవ సదన్‌లో ఈనెల 26న ఉదయం 11 గంటలకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే తెలిపారు. ప్రజలు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

చదువులో రాణించాలి

నేరడిగొండ: విద్యార్థులు చదువులో రాణించాలని సీడీపీవో సౌందర్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పోషణ పక్వాడ్‌లో భాగంగా న్యూట్రిషన్‌పై అవగాహన కల్పించారు. ఇందులో సూపర్‌వైజర్ మంజుల, కేజీబీవీ ఎస్‌వో రజిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గురువారం ఇచ్చోడకు చెందిన నిమ్మల సంతోష్‌కుమార్‌రెడ్డి, ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీకాంత్, ఎస్ఎంసీ చైర్మన్ నాయిడి మహేశ్, ఉపాధ్యాయులు భూమన్న, గంగయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని ఘన్పూర్‌లో నిర్వహించిన కుమురం సూరు క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఫైనల్‌లో జైనూర్ జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన జట్టుకు మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్ బహుమతులు ప్రదానం చేశారు. కొండేరి రమేశ్, కలిపాక రాజశేఖర్, సంతోశ్, బోడ్డ కిరణ్, సంతోశ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్: మండలంలోని లింగోజితండా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని బీఆర్ఎస్‌వి జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట తన్నీరు సతీశ్, ముజీబ్, సుశీల్ ఉన్నారు.

పిల్లలకు మెటీరియల్ కిట్స్ అందజేత

ఆదిలాబాద్‌టౌన్: వివిధ రకాల రుగ్మతలతో బాధపడుతున్న ప్రత్యేక అవసరాలు గల 18 ఏళ్లలోపు పిల్లలకు ఎన్ఐఈపీడీ, ఎన్ఐఎంహెచ్ సౌజన్యంతో లెర్నింగ్ మెటీరియల్ కిట్స్‌ని ఉచితంగా అందించారు. డీఈఐసీ మేనేజర్ జైవింద్ మాట్లాడుతూ.. కిట్‌లోని ఉపకారణాలు మానసిక వైకల్యం గల వారికి మెరుగైన జీవనం కోసం ఎంతగానో ఉపయోగపడే విధంగా ఉందన్నారు. శ్యాం, హేమలత, జుభియా, రాధిక, సైకాలజిస్ట్ కృష్ణ, దొంతుల ప్రవీణ్, శ్రీనివాస్, డెంటల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

టిష్యూ మిషన్ బాగు చేయించాలి


ఆదిలాబాద్‌అర్బన్: రిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన టిష్యూ ప్రాసెసింగ్ మిషన్‌కు మరమ్మతులు చేయాలని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రెటరీ సామ రూపేశ్‌రెడ్డి రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కోరారు. శుక్రవారం తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

పెన్షనర్స్ జిల్లా కమిటీ ఎన్నిక

ఆదిలాబాద్‌అర్బన్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం పీఆర్టీయూ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.దయాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా ఎస్.శశికాంత్, ఉపాధ్యక్షుడిగా ఉమాకాంత్, గంగాధర్, షీలా, వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా జగన్‌మోహన్, కోశాధికారిగా బాపురావు, కార్యదర్శులుగా దేవిదాస్, అశోక్, విశ్వనాథ్, సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

కైలాస్‌నగర్: వేసవిలో తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక రాంనగర్‌లో పర్యటించిన ఆయన మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులను పరిశీలించి లీకేజీలపై ఆరా తీశారు. అలాగే ఫిల్టర్ బెడ్‌ను సందర్శించి అక్కడి మరమ్మతు పనులు పరిశీలించారు. మావల నుంచి ఫిల్టర్ బెడ్‌కు నీరందించే పైప్‌లైన్ పనులు, చెరువులోని నీటి లభ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఈ తిరుపతి, వార్డ్ కౌన్సిలర్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్